క్లుప్తంగా

వరద బాధితుల నిమిత్తం రూ.5 లక్షల సాయం



రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న మడుపల్లి మల్లీశ్వరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరద ప్రభావంతో సర్వస్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలిచేందుకు సాయం అందించినట్లు గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడుపల్లి మోహన గుప్త తెలిపారు. ఈ మేరకు వరద సహాయక కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలకు సంతృప్తి చెంది ఆ ట్రస్ట్‌కు తమ ఫౌండేషన్ ద్వారా రూ. 5 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును మంగళవారం అందజేశారు. స్థానిక గుప్త ఫౌండేషన్ కార్యాలయంలో మడుపల్లి మల్లీశ్వరి ద్వారా ఈ చెక్కు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఆడిటర్ సుబ్బారావు, మేనేజర్ కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు 150 మంది శానిటేషన్ సిబ్బంది తరలింపు

ఏలూరు (టూటౌన్): విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో శానిటేషన్ పనుల కోసం ఏలూరు కార్పొరేషన్ నుంచి 150 మంది సిబ్బందిని మంగళవారం తరలించారు. వీరంతా అదనపు కమిషనర్ జి.చంద్రయ్య నేతృత్వంలో అక్కడ విధులు నిర్వహించనున్నారు. వారితో పాటు సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు వెళ్లారు. వీరిని తరలిస్తున్న లారీని మేయర్ నూర్జహాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ జి.చంద్రయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నుంచి ఆహార ప్యాకెట్ల సరఫరా

విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం ఏలూరు నుంచి మంగళవారం కూడా ఆహార పొట్లాలు సరఫరా చేశారు. ఉదయం 20 వేల మందికి సరిపడా టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం 10 వేల మందికి సరిపడా భోజనాల ప్యాకెట్లు పంపించినట్టు కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.

వరద బాధితులకు పౌష్టికాహారం పంపిణీ


తాళ్ళపూడిలో ఆహార పొట్లాలు అందజేస్తున్న సోషల్ సర్వీస్ సెంటర్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వరద బాధితులకు ఆపన్న హస్తం అందించినట్లు ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ టీ.ఇమ్మానియేలు తెలిపారు. పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ పరిధిలోని తాళ్ళమూడి గ్రామంలో ప్రజలు వరద ముంపులో చిక్కుకుపోయిన విషయాన్ని తెలుసుకుని ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ చైర్మన్, ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సూచనల మేరకు తమ సిబ్బంది ద్వారా గ్రామంలోని 1300 మందికి పౌష్టికాహార పొట్లాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెదపాడు విచారణ గురువు ఫాదర్ మెలిక్రియేల్, ఫాదర్ జీ. మైఖేల్, ఫాదర్ రాజు, మత కన్యలు, సోషల్ సర్వీస్ సెంటర్ సిబ్బంది ఎస్.కృపానందం, ఎస్.వీరాస్వామి, ఎస్.కాసు తదితరులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ రాజీనామా

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ గురునాథ్ తన వ్యక్తిగత కారణాల దృష్ట్యా మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఏ.భానుప్రతాప్‌కు అందజేశారు.

కోమటిలంక చుట్టూ వరద నీరు

కొల్లేరు గ్రామాల్లో ఆందోళన

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామాలను మంగళవారం వరదనీరు చుట్టుముట్టింది. శ్రీపర్రు, కలకుర్రు, మానూరు, కోమటిలంక, పెదయాగనమిల్లి, పైడిచింతపాడు, ప్రత్తికోళ్ళలంక, కొక్కిరాయిలంక, గుడివాకలంక, మొండికోడు గ్రామాల ప్రజలను వరద భయం వెంటాడుతోంది. నాలుగురోజులుగా తమ్మిలేరు బుడమేరు గుండా కొల్లేరులోనికి వేల క్యూసెక్కుల వరదనీరు చేరుతున్న సంగతి తెలిసిందే. దీంతో కొల్లేరులో ప్రధాన డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరదనీరు వేగంగా సముద్రంలోకి చేరడం లేదని, దీనివల్ల నీరు వెనక్కి ఎగదన్ని గ్రామాలను ముంచేసే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

ఇప్పటికే కొల్లేరులో నడిమధ్యలో ఉన్న కోమటిలంక గ్రామాన్ని వరదనీరు చుట్టు ముట్టింది. ప్రధాన రోడ్డుపై నుంచి 10 అడుగుల ఎత్తులో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. బడి పిల్లలు, మహిళలు, వృద్ధులు రేకు పడవపై ప్రయాణం నిలిపేశారు. నిత్యావసర సరుకుల కోసం పురుషులు రేకు పడవపై భయం భయంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. మరోపక్క గుడివాకలంక పరిసరాల్లో పలు చోట్ల ప్రధాన రోడ్డుపై నుంచి వరద ప్రవహిస్తోంది. స్థానిక బీసీకాలనీ పక్క నుంచి వరద వేగంగా పారుతోంది. మరో రెండు అడుగులు నీటి మట్టం పెరిగితే, కాలనీలోకి వరదనీరు చేరే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మొండికోడు గట్టు దిగువన నిర్మించుకున్న గుడిసెల వద్ద నుంచి వరద పారుతోంది. ప్రత్తికోళ్లంలక బీసీకాలనీ, జెడ్పీ స్కూల్ ఆటస్థలంలో వరదనీరు చేరింది. పైడిచింతపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే రోడ్డు నీట మునిగింది. ఫలితంగా ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. కలకుర్రు గ్రామానికి వరద చుట్టుముట్టింది. ప్రధానరోడ్డుపైకి నీరు చేరుతోంది. శ్రీపర్రు బీసీకాలనీ, లింగారావుగూడెం లోతట్టు ప్రాంతాలకు పంటచేల గుండా వరదనీరు ప్రవేశించింది.


రోడ్డు మునిగిపోవడంతో కోమటిలంక గట్టుపై నిలిచిపోయిన వాహనాలు


ప్రమాదకరంగా వరద నీటిలో పయనిస్తున్న దృశ్యం


తాళ్ల సాయంతో రేకు పడవలో పయనం

అధికారులు రాలేదు


మా గ్రామాన్ని వరద చుట్టేసింది. పడవ మార్గం ప్రమాదకరంగా మారింది. పిల్లలు, మహిళలు, వృద్ధులు రెండురోజులుగా ఇంటిలోనే ఉంటున్నారు. పాలు, మంచినీళ్లు పూర్తిస్థాయిలో అందడం లేదు. మండలస్థాయి అధికారులు ఎవ్వరూ మా గ్రామానికి రాలేదు. అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం మోటార్ పడవ అందుబాటులో ఉంచాలి. మా ఊరిలో రోగుల కోసం డాక్టర్‌ను, వైద్యశిబిరంను ఏర్పాటు చేయాలి.

– తెనాలి యోహాన్, కోమటిలంక సర్పంచ్

వరద బాధితులను వెంటనే ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): వరద బాధితులకు యుద్ధప్రాతిపదికన పునరావాస సౌకర్యం కల్పించాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కురిసన వర్షాలకు బుడమేరు భారీ స్థాయిలో ఉప్పొంగి విజయవాడ నగరంలోని పలు ప్రాంతాను ముంచెత్తిందన్నారు. ఈ వరదల్లో మరణించిన వారికి తమ సంఘం తరఫున సంతాపాన్ని తెలియజేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో వరద బీభత్సం వలన లక్షలాది ఎకరాల్లో వరి పంట నీటి మునిగి పోయిందన్నారు. ఇతర పంటలు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి పారిశుధ్య, వైద్య, ఆరోగ్య సహాయ, పునరావాసాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

9 నుంచి కావూరిలో కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఈనెల 9వ తేదీనుంచి స్థానిక వసంత మహల్ సెంటర్ వెంకట్రామా ప్రెస్ రోడ్డులోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డీసీఏ, డీటీపీ లోనూ, కామర్స్‌తో ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి టాలీ లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏలూరు నగరం, పరిసర గ్రామాల్లోని 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

తన భార్యకు వీడియో కాల్ చేస్తున్నాడని..

ఏలూరు టౌన్: తన భార్యకు వీడియో కాల్ చేస్తున్నాడనే అనుమానంతో ఒక యువకుడిని గదిలో నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసిన ముగ్గురిపై మంగళవారం రాత్రి ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఏలూరు కండ్రికగూడానికి చెందిన అరవింద్ అనే యువకుడుకి ఏలూరు చాటపర్రు రోడ్డులో నివాసం ఉంటున్న సతీష్ అనే వ్యక్తి స్నేహితుడు. సతీష్ భార్యకు అరవింద్ తరచుగా వీడియో కాల్ చేస్తున్నాడని అనుమానంతో తన ఇంటికి రావాలని అరవింద్‌కు ఫోన్ చేసి రప్పించాడు. ముగ్గురు వ్యక్తులతో కలిసి అరవింద్‌ను నిర్బంధించి చిత్రహింసలకు గురి చేయించాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొట్టి ప్రశాంత్ కుమార్ అలియాస్ మున్నా, సతీష్, మరో ఇద్దరిపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో మంగళవారం రాత్రి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దెబ్బతిన్న శనివారపుపేట కాజ్‌వే

ఏలూరు (టూటౌన్): స్థానిక అమీనాపేట నుంచి శనివారపుపేట వైపు వెళ్లే మార్గంలో తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వే పైకి నీరు చేరడంతో రెండు రోజుల క్రితం దాన్ని మూసివేసారు. కాజ్‌వే పైనుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మంగళవారం యథావిధిగా రాకపోకలకు అనుమతి ఇచ్చారు. నీళ్లు తగ్గిన తరువాత ఆ నీటిలో నాని కాజ్‌వే బ్రిడ్జిలో కొంత భాగం దెబ్బతింది. దెబ్బతిన్న ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ డివైడర్ బోర్డులను ఉంచారు. మరో తుపాను రానుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మళ్లీ కాజ్‌వే బ్రిడ్జిపైకి నీరు వస్తే మరింత దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. వాస్తవానికి ఎంతో కాలంగా ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఏలూరు నగరవాసులు కోరుతున్నారు. ఈ ప్రాంతాన్ని కలెక్టర్, ఇతర అధికారులు కూడా పలుమార్లు పరిశీలించారు. అయినా నేటికీ వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అమీనాపేట–శనివారపుపేట కాజ్‌వే బ్రిడ్జి స్థానంలో పూర్తి స్థాయిలో వంతెన నిర్మాణం చేపట్టాలంటూ కోరుతున్నారు.


వరద తగ్గిన తర్వాత బయటపడిన శనివారపుపేట కాజ్‌వే కొంత భాగం

ఉత్సాహంగా పౌష్టికాహార మాసోత్సవం

ఏలూరు (టూటౌన్): తల్లి గర్భం నుంచే పిల్లలకు ఉత్ప్రేరణ జరుగుతుందని ఐసీడీఎస్ పీడీ కేపీవీఎల్ పద్మావతి అన్నారు. స్థానిక రెహమత్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏలూరు ప్రాజెక్టు అధికారిణి కె.పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అభివృద్ధికి సంబంధించి నాలుగు కార్నర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మనం ఇంట్లో ఉపయోగించే వస్తువుల ద్వారా పిల్లలకు రకరకాల ఆట వస్తువులు తయారు చేసుకోవచ్చునని వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోషణ (భి) – పడాయి (భి) అనే అంశం మీద పూర్వ ప్రాథమిక విద్య వివిధ అంశాలకు సంబంధించిన మెటీరియల్ ప్రదర్శించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు అభినయ గీతాలు, ఆటల ద్వారా అలరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మల్లిక, సూపర్‌వైజర్ ఎండీ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నవతి, కె.ఝాన్సీలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.


పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ కేపీవీఎల్ పద్మావతి

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

ఎస్పీ ప్రతాప శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ అన్నారు. నగరంలో ఇండోర్ స్టేడియం, కలెక్టరేట్, జడ్పీ సెంటర్, ఫైర్‌స్టేషన్, ఓవర్ బ్రిడ్జి సెంటర్, రైల్వే లైన్ ప్రాంతాలలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాలేజీలు విడిచి పెట్టే సమయంలో విద్యార్థులు వెళ్లేందుకు కాలేజీ బస్సులు నిలిపి ఉంచే ప్రదేశాలను పరిశీలన చేసి ట్రాఫిక్ నియంత్రించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇండోర్ స్టేడియం ప్రాంతంలో విద్యార్థినులతో ఎస్పీ మాట్లాడుతూ కాలేజీ విడిచిపెట్టిన సమయాల్లో, బస్సులు ఎక్కే సమయాలలో ఏదైనా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 112 డయల్‌కి తెలియజేయాలన్నారు. నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థినులకు జిల్లా ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


ఇండోర్ స్టేడియం రోడ్డులో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతాప శివకిషోర్

రేపు గురుపూజోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అతిథులు పురస్కారాలు ప్రదానం చేస్తారని తెలిపారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కొలుసు పార్థసారథి, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీలతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వంగాయగూడెంలో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్‌లోని వంగాయగూడెం ప్రాంతంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి మూడున్నర కాసుల బంగారు ఆభరణాలను అపహరించారు. వన్‌టౌన్ సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంగాయగూడెం ప్రాంతానికి చెందిన కె.విజయశృంగారం అనే మహిళ తన ఇంటికి తాళం వేసి గత నెల 28న దుగ్గిరాలలోని తన సోదరుడి ఇంటికి వెళ్లి తిరిగి 2వ తేదీన ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలకొట్టి సేఫ్ లాకర్‌లో ఉండాల్సిన మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై మదీనా బాష చెప్పారు.

మద్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పైడిపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఆండ్రు పెద్దరాజును అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. 2700 విలువ చేసే 18మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

చవితి వేడుకల్లో నిబంధనలు పాటించాలి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్‌లోని ప్రజలు భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు ఆనందంగా జరుపుకోవాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ సత్యనారాయణ అన్నారు. ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ ఆదేశాలపై మంగళవారం ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో చవితి ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఉత్సవాలకు కమిటీలు అనుమతి తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కగా ఉత్సవ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, లౌడ్‌స్పీకర్లను ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని, చుట్టుపక్కల వారికి సౌండ్ పొల్యూషన్ లేకుండా చూడాలని సీఐ సూచించారు. పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రాంతాల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రిళ్లు పందిళ్ల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు భద్రత ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు నిలిచేలా చూడవలసిన బాధ్యతను ఉత్సవ కమిటీ సభ్యులే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు వన్ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మదీనా బాషా సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

మానేపల్లికి ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ అవార్డు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఏలూరు లయన్స్‌క్లబ్ విజన్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావుకు విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ అవార్డు లభించింది. ఇందుకు సంబంధించిన వివరాలను క్లబ్ ప్రతినిధులు తెలియజేశారు. విజయవాడలోని ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో నిర్వహించిన ఆసుపత్రి వార్షికోత్సవ కార్యక్రమంలో రామారావుకు ఈ అవార్డును పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ చేతులమీదుగా అందించారు. ఆసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ అరవింద్ రాయ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా అత్యధిక మంది ప్రజలకు ఉచిత నేత్ర వైద్య సేవలు అందించడంతో పాటు ఎంతోమందికి శస్త్రచికిత్సలు చేయించడంలో రామారావు చూపిన చొరవ అభినందనీయమన్నారు. అలాగే నేత్రదానానికి సంబంధించి ఎక్కువ కార్నియాలు సేకరించడంలో రామారావు విశేషంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసూయ కపూర్ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాన్ని పెనమలూరు ఎమ్మెల్యే ద్వారా అందుకుంటున్న మానేపల్లి రామారావు

నలుగురిపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఒక వ్యక్తిని ఇంట్లో బంధించి తాళ్లతో కట్టేసి చిత్రహింసలకు గురి చేసిన నలుగురిపై ఏలూరు రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. ఏలూరు గులాబీ తోటకు చెందిన షేక్ అహ్మద్ రియాజ్ షార్ట్ ఫిలిమ్స్ తీస్తు ఉంటాడు. ఈ నేపథ్యంలో చాటపర్రు రోడ్డునకు చెందిన నున్నాబత్తుల కిషోర్, ముంగర దుర్గ, అయ్యప్పసాయి అనే వ్యక్తులు పరిచయం అయ్యారు. షార్ట్ ఫిలిమ్స్‌లో వీరిని యాక్టర్లుగా పెట్టాడు. అయితే గత నెల 26వ తేదీ రాత్రి నున్నాబత్తుల కిషోర్, షేక్ అహ్మద్ రియాజ్‌కు ఫోన్ చేసి తమ ఇంటికి రావాలని చెప్పడంతో వెళ్లాడు. అయితే అక్కడ అతనిని నలుగురు కలిసి కట్టేసి చిత్ర హింసలకు గురిచేశారు. ఎవరికైనా చెబితే చంపివేస్తామని బెదిరించారు. దీంతో బాధితుడు షేక్ అహ్మద్ రియాజ్ మంగళవారం రాత్రి ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నున్నాబత్తుల కిషోర్, ముంగర దుర్గ, అయ్యప్ప, సాయిలపై ఎస్సై సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్‌మేళాలో 22 మందికి ఉద్యోగాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడు ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 22 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలిపారు. జాబ్ మేళాలో హీరో కంపెనీ, తనిష్క్, బజాజ్ క్యాపిటల్, రిలయన్స్, రెడ్డి అండ్ రెడ్డి మోటార్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జాబ్ మేళాకు మొత్తం 54 మంది హాజరు కాగా 22 మందిని ఆయా కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గోపు వెంకటేశ్వరరావు (60) మృతి చెందాడు. ఏలూరు పరిసర ప్రాంతాల్లో గత 20 ఏళ్లు కూలి పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్న వెంకటేశ్వరరావు ఈనెల 2తేదీన బిల్డింగ్ పనులు చేస్తూ ఉండగా సెంట్రింగ్ ఒక్కసారిగా విరిగి పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అతడు మృతిచెందాడు. అతని మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరచారు. వృద్ధుడి బంధువులు ఎవరైనా ఉంటే ఏలూరు 3 టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు – తిరుపతి	16.00	4830	27

చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌ల తనిఖీ


దీవెన చిల్డ్రన్ హోమ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రిజిస్టర్ అయిన 5 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌లను ఐసీడీఎస్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ మంగళవారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా మాట్లాడుతూ బాలలకు అందిస్తున్న వసతి, సదుపాయాలను పరిశీలించామన్నారు. ప్రతి ఒక్క చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ జువైనల్ జస్టిస్ యాక్ట్‌నందు పేర్కొన్న నిబంధనలు పాటించాలన్నారు. అదేవిధంగా ఎవరైనా ఆదరణ, సంరక్షణ అవసరత ఉన్న బాలలకు వసతిగృహాలు నడుపుతున్నట్లయితే జువైనల్ జస్టిస్ యాక్ట్ 2015 సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ ఖచ్చితంగా చేయించుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పెంచాలి


డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు గడువును పెంచాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహంకు పీఆర్‌టీయూ నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ వివిధ కారణాలతో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోనందున మరో అవకాశం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించకుండా జరిపిన పని సర్దుబాటు ప్రక్రియ వల్ల కొందరు ఉపాధ్యాయులు డివిజన్ స్థాయిలో 100 కిలోమీటర్లపైగా దూరంలో ఉన్న పాఠశాలలకు బదిలీ అయ్యారన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పీఆర్‌టీయూ నాయకులు ఎం.రాంబాబు, సయ్యద్ ముర్సలీన్ ఉన్నారు.

గర్భిణులు, వృద్ధుల తరలింపు

వేలేరుపాడు: గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లోని నిండు గర్భిణులను, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎస్.శర్మిష్ఠ తెలిపారు. మంగళవారం వేలేరుపాడు మండలం రుద్రమకోటకు చెందిన గర్భిణీని వేలేరుపాడు పీహెచ్‌సీకి తరలించామన్నారు.